క్లుప్తంగా

లక్ష్మీనర్సింహ స్వామికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: జిన్నాయిగుట్ట లక్ష్మీనరిసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం భక్తులు స్వామి వారిని పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు మురళీశర్మ, అజయ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ సభ్యులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి డాక్టర్స్‌కాలనీలో ఉన్న లక్ష్మీ వైట్‌హౌస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో శనివారం సత్యం హోమియోపతి హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌ను మేనేజింగ్ డైరెక్టర్ తడక వెంకటేశ్, తడక రమేశ్, పెద్ది జగదీశ్, సత్య హోమియోపతి చైర్మన్ గుజ్జ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ హోమియోపతి అందరికీ అందుబాటులో ఉండాలనే ఈ క్యాంప్ ప్రారంభించామని అన్నారు. డాక్టర్ కన్సల్టేషన్, నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్, కస్తూరి సుదర్శన్, కుడికాల బాలనర్సింహ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య




నరేశ్ (ఫైల్)

చైతన్యపురి: భార్యతో గొడవల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఈ విషాద ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... కొత్తపేట సీటీఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డేరెంగుల నరేశ్ (33)కు బీఎస్‌రెడ్డినగర్‌కు చెందిన శిరీషతో 2020లో పెళ్లి జరిగింది. కొంతకాలం తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో శిరీష తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. గతేడాది మార్చిలో నరేశ్ ఉద్యోగ రీత్యా న్యూజిలాండ్‌కు వెళ్లగా, జూలైలో శిరీష మగబిడ్డకు జన్మనిచ్చింది. పెద్ద మనుషుల సమక్షంలో భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఈ ఏడాది జనవరిలో నరేశ్‌ను ఇండియాకు రప్పించారు. మార్చి 27న ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన నరేశ్ శనివారం తన బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు నవీన్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం ప్రత్యేకాధికారిగా సుకీర్తి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా మత్స్యశాఖలో పనిచేస్తున్న ఏడీ సుకీర్తిని జిల్లా కలెక్టర్ శశాంక నియమించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా సుకీర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయంలో ప్రత్యేకాధికారులు చొరవ చూపాలని, గ్రామాల్లో పర్యటించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సందీప్

యాచారం: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించారు. చింతపట్లలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం క్వింటాల్ ధాన్యానికి రూ. 2,203, సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు 2,183గా నిర్ణయించారన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మంచి ధరను పొందాలని సూచించారు



కందుకూరు: బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో సభకు వెళ్తున్న నాయకులు



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీ నుంచి..

కదిలిన కాంగ్రెస్ దండు

జనజాతరకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ నుంచి..

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గం రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించిన జన జాతర మహాసభకు సరూర్‌నగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ నాయకులుక బేర బాలకిషన్, బోయిని శంకర్ యాదవ్, ఆకుల అరవింద్ కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, గుల్షన్ ఇమ్రాన్, చిక్కుల శివప్రసాద్, షఫీ, భాస్కర్, కిషోర్ తదితరులున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా వసతులు

తుక్కుగూడ: తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన తెలంగాణ జనజాతర సభకు మహేశ్వరం నియోజవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరయ్యారు. నాలుగు రోజులుగా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు పర్యవేక్షించడంతో పాటు నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించారు. వచ్చిన నాయకులకు ఇబ్బందులు లేకుండా వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కెఎల్‌ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, యెల్మేటి అమరేందర్ రెడ్డి, గోగికార్ జానకీరాం, షేక్ జహంగీరుద్దీన్, బోద మాధవ రెడ్డి, మస్న రవికుమార్, బంటు ధనుంజయ్, మద్దుల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి, బుడుమాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ వాణిరెడ్డి

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎలక్షన్–2024 స్వీప్ కార్యాక్రమంలో భాగంగా 'ఐ ఓటు ఫర్ ష్యూర్' అనే నినాదంతో శనివారం మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో శానిటేషన్, మెప్మా సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఓటు తోనే మన పాలకులను మనమే నిర్ణయించుకునే శక్తి ఉందన్నారు. అవినీతిరహిత ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్నప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. బలమైన ప్రజాస్వామ్యం కోసం ఘనమైన భాగస్వామ్యమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యెన్నం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇఫ్తార్ విందులు

పహాడీషరీఫ్: రంజాన్ పండుగ సమీపిస్తుండడంతో ఇఫ్తార్ విందులు ఊపందుకున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సమయం కావడంతో ప్రజా ప్రతినిధులు సైతం ముస్లింలకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రంజాన్ చివరి శుక్రవారం(జుమ్మాతుల్ విదా) రాత్రి జల్‌పల్లి మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విందులో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది పాల్గొన్నారు. పహాడీషరీఫ్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహమూద్ ఇచ్చిన విందులో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. జల్‌పల్లిలో మాజీ ఉప సర్పంచ్ షేక్ జహంగీరుద్దీన్ ఇచ్చిన విందులో కేఎల్‌ఆర్‌తో పాటు పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, మస్న రవికుమార్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, టీకేఆర్ తదితరులను సన్మానిస్తున్న ముస్లింలు



పహాడీషరీఫ్‌లో ముస్లింలకు ఖర్జూర ఇచ్చి ఉపవాస విరమణ చేయిస్తున్న ఎమ్మెల్యే సబిత



జల్‌పల్లిలో పాల్గొన్న కేఎల్‌ఆర్

ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన భాషమోని రామస్వామి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ. 3వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, అంజన్‌రెడ్డి, రాములయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన కనకమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న శెట్టిపల్లి మాజీ సర్పంచ్ సత్యం శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

మాడ్గుల: అన్నబోయిన్‌పల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాయం చేయాలని కోరుతూ మృతుని కుటుంబ సభ్యులు శనివారం ఆందోళన చేశారు. నాగార్జున సాగర్ రహదారిపై మాడ్గుల మండలం అన్నబోయిన్ పల్లి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ యాదయ్య మృతి చెందాడు.తన భర్త మృతిపట్ల అనుమానాలు భార్య శారద మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నబోయిన్ పల్లికి చెందిన నరోత్తం రెడ్డి ఇంటికొచ్చి తీసుకెళ్లాడని అనంతరం మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త మృతిపై విచారణ జరిపించి న్యాయం చేయాలని శారద కోరారు. ఈ విషయంలో మాడ్గుల సీఐ వివరణ కోరగా ఫిర్యాదు అందిందని దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

అనాథ విద్యార్థి గృహం ఒక ఆలయం

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



అనాథ విద్యార్థి గృహంలో వాష్ రూమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థి గృహం ఒక దేవాలయం అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లేఅవుట్ లోని అనాథ విద్యార్థి గృహం గ్రౌండ్ ఫ్లోర్‌లో నూతనంగా నిర్మించిన 14 వాష్ రూమ్స్, అధునాతన హెయిర్ కటింగ్ సెలూన్, వాషింగ్ మిషన్స్ సెంటర్‌ను శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనాథ విద్యార్థులకు భోజన, వసతితో పాటు ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో చదువు చెప్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న అనాథ విద్యార్థి గృహం ఒక ఆలయం వంటిదని కొనియాడారు. ఉద్యోగులను పెట్టుకోకుండా విద్యార్థులకే హాస్టల్ నిర్వహణ, ఆర్థిక పరిపాలన బాధ్యతలు అప్పగించినందుకు గృహం కమిటీని అభినందించారు. అనంతరం గృహంలోని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అనాథ గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్, ప్రధాన కార్యదర్శి పద్మజ, సలహా మండలి చైర్మన్ శశిమోహన్, కోశాధికారి సుప్రసన్న దేవి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కృషి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రజనీవిఠల్‌రెడ్డి

హస్తినాపురం: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు తమ విద్యాసంస్థల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. సాగర్‌రోడ్డులోని హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో శనివారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వొకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నల్లగౌనులు ధరించి పట్టాలు అందుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రావు, ఇన్‌ఛార్జీలు సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలం.. 'ఆవిర్భావం'

నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసిన నాయకులు



బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో పార్టీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘనంగా నిర్వహించారు. నాదర్‌గుల్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి నిమ్మల రవికాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో, బాలాపూర్, బడంగ్‌పేట్‌లో పార్టీ జెండాలను ఎగురవేశారు. మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించి ఏకాత్మత మానవతా సిద్ధాంతాలతో ముందుకు వెళ్తోందన్నారు. పార్టీ కోసం ఎంతో మంది తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, నాయకులు ఏనుగు రాంరెడ్డి, లక్ష్మణ్, రమేశ్, అంజిరెడ్డి, పెద్దయ్య, పుల్లారెడ్డి, రవికాంత్‌గౌడ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: బీజేపీ జెండాను ఎగురువేస్తున్న పార్టీ నాయకులు

మీర్‌పేట కూడలిలలో..

మీర్‌పేట: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో శనివారం మీర్‌పేట కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ.. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, గాజుల మధు, కార్పొరేటర్లు భిక్షపతిచారి, బాలకృష్ణ, హరినాథ్‌రెడ్డి, సీలారవినాయక్, యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్
- ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేతల ఆందోళన



ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా మరియు రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులను అవమానించేలా రైతు బంధు విడుదల చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. ఇష్టానుసారంగా కరెంట్ కోతలు విధిస్తున్నారని, పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఎక్కడని? రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇవ్వకపోవడంతో పంటలు ఎండి, అప్పులు తీర్చలేక రైతులు ఇప్పటికే 209 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న ప్రతీ రైతు కుటుంబానికి రూ.5లక్షల చొప్పున, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్ రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవేందర్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.లచ్చానాయక్, ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, గణేశ్, జంగయ్య, సీనియర్ నాయకులు కాకి దశరథ, ప్రకాశ్‌రెడ్డి అశోక్, దామోదర్‌గౌడ్, బాబయ్య, దేవేందర్‌గౌడ్, రాములు, నర్సింహ, దేవేందర్, పాండురంగారెడ్డి, పారిజాతం, దర్శన్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ఉన్ని వెంకటయ్య, కొండల్‌రెడ్డి, వెంకటేశ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకు పోరాడుతాం

ఎస్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం



మాట్లాడుతున్న పురుషోత్తం, పార్టీ సభ్యులు

బడంగ్‌పేట్: ఏళ్ల నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం డిమాండ్ చేశారు. శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో రైతు బాధితులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పురుషోత్తం మాట్లాడుతూ.. బొద్రమోని కుటుంబీకులు కుర్మల్‌గూడ సర్వే నంబర్ 80/3లో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిలో 60 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని.. ఈ భూమిని లాక్కుని బ్రాహ్మణ ట్రస్ట్‌కు రెండు, క్రిస్టియన్ శ్మశాన వాటికకు రెండు ఎకరాలు మిగిలిన భూమిని సైతం ఇతర ట్రస్ట్‌లకు కేటాయించారన్నారు. రైతుల పొట్టలు కొట్టి ట్రస్ట్‌లకు భూములు కేటాయించడం సరికాదన్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని లేదంటే వారికి న్యాయం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకురాలు ఆర్.ఝాన్సీ, రాజేశ్, రవినాయక్, భానుప్రసాద్, జి.లక్ష్మి, నారాయణ, భూ బాధితులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ అయ్యప్ప

యాచారం తహసీల్దార్ అయ్యప్ప

యాచారం: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని యాచారం తహసీల్దార్ అయ్యప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం పోలింగ్ నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటేసి మళ్లీ సాధారణ లైనులో ఉండి ఓటేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి పొరపాట్లను సరిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: ప్రభుత్వ నిబంధనల కనుగుణంగా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కెవి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల నిమిత్తం ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు, మాస్టర్ ట్రైయినర్‌తో ఎన్నికలు ఏవిధంగా నిర్వహించాలని, ఫామ్–12 పోస్టల్ బ్యాలెట్ గురించి వివరించారు. అనంతరం పూర్తి చేసిన ఫామ్–12 పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఉద్యోగుల నుంచి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సంతోశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తలకొండపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రంగారెడ్డి

సమస్యలు పరిష్కరించండి

- మండల ప్రత్యేకాధికారి శాంతిశ్రీ

మంచాల: గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శాంతి శ్రీ పేర్కొన్నారు. శనివారం మంచాల మండల కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా తాగు నీటి ఇబ్బందులు తలెత్తే గ్రామాలను గుర్తించాలన్నారు. గ్రామాల్లో పైపు లైన్ లీకేజీలు, గేట్ వాల్వ్, మోటార్ల మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. తాగు నీటి సమస్య జఠిలమైన గ్రామాల్లో వ్యవసాయ బోర్లు లీజుకు తీసుకొని నీటిని సరఫరా చేస్తామన్నారు. తాగు నీటి సమస్య ఉన్నట్లతే 9347492260పై సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ తేజ్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.